
పుణ్యస్నానాలకూ ఇక్కట్లే
- హామీలు గాలికి.. పునరుద్ధరణకు నోచుకోని ఆలయ కోనేరు
- రూ. లక్షలు వెచ్చించి నీటిశుద్ధీకరణ యంత్రం ఏర్పాటు చేసినా నిష్ప్రయోజనమే

8



నేడు మల్లన్న లష్కర్‌వారం

- కొమురవెల్లి చేరుకున్న సికింద్రాబాద్ భక్తులు
- ధూళి దర్శనం.. ఒడిబియ్యం సమర్పణ

చేర్యాల, జనవరి 25: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు లష్కర్‌వారాన్ని నిర్వహించనున్నారు. సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా, రెండో ఆదివారాన్ని లష్కర్‌వారంగా పిలుస్తారు. సికింద్రాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. శనివారం సాయంత్రానికి భారీగా భక్తులు ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుని ఆలయ పరిసరాల్లో బస చేశారు. మల్లన్నను ధూళి దర్శనం చేసుకున్నారు. నేడు ఎల్లమ్మతల్లికి బోనాలు నివేదించి, మల్లన్నకు పట్నాలు రచించి మొక్కులు తీర్చుకోనున్నారు.

అక్రమ వసూళ్లు ఆగేనా!

గత ఆదివారం పట్నంవారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్న విషయం విధితమే. అయితే, ఆలయవర్గాలు పర్యవేక్షించకపోవడంతో భక్తులు మొక్కుబడులు తీర్చుకునేందుకు దోపిడీకి గురయ్యారు. కొబ్బరికాయను రూ.50 చొప్పున విక్రయించడంతో పాటు రూ.100కు రెండింటిని బలవంతంగా అంటకట్టారు. తలనీలాల సేకరణకు కట్నాల పేరిట అధిక డబ్బు వసూలు చేశారు. ఎల్లమ్మగుట్టపై కల్లుసీసాను అధిక ధరలకు విక్రయించారు. పట్నం వారం పూర్తయి వారం కావస్తున్నా లోటుపాట్లు గుర్తించి భక్తుల నుంచి అధిక దోపిడీ వసూళ్ల నివారణతో పాటు ఆయా అంశాలపట్ల లష్కర్‌వారమైనా స్పందిస్తారా.. షరా'మామూలు'గా చేతులెత్తేస్తారా? అని భక్తులు ఉసూరుమంటున్నారు.



ఒడిబియ్యం, బండారి తీసుకువస్తున్న భక్తులు

సంగారెడ్డి అంటే తూర్పు.. జయము.. ప్రకాశము..

- జగ్గారెడ్డి (జయప్రకాశ్‌రెడ్డి)ని అభివర్ణించిన శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ
- సంగారెడ్డిని చూస్తే లైట్ల వెలుగులో ప్రసరిస్తున్న పట్టణాన్ని చూసినట్లుగా ఉంటుంది
- జేబులో పైసలుంటే ఇస్తూనే ఉంటారు.. లేకుంటే అప్పు సప్పు చేసైనా సాయం చేస్తుంటారు.. ఇదే జగ్గారెడ్డి దాన గుణం



మాట్లాడుతున్న శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ, జగ్గారెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న మాధవానంద సరస్వతి స్వామిజీ

సంగారెడ్డిటౌన్, జనవరి25 (ఆంధ్రజ్యోతి): 'సంగారెడ్డి అంటే తూర్పు.. జయము.. ప్రకాశము.. అందుకే ఈ పట్టణం ఎప్పటికీ లైట్ల వెలుగులో ప్రసరిస్తున్నట్లుగా ఉంటుంది' అని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ వ్యాఖ్యానించారు. తూర్పు అనే ఇంటి పేరుతో నిరంతరం ప్రకాశిస్తుంటారని ఆయన జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. దాన గుణం, ధర్మ గుణం లక్షణాలను జగ్గారెడ్డి పుణికిపుచ్చుకున్నారని కొనియాడారు. ఆయన జేబులో డబ్బులున్నాయంటే ఇస్తూనే ఉంటారని.. లేకుంటే అప్పు సప్పు చేసైనా ఆపదలో ఉన్న వారికి సహాయ పడుతారని చెప్పుకొచ్చారు. ఆయన చేపట్టే ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా సంపూర్ణంగా ఉంటాయని కొనియాడారు. జగ్గారెడ్డిలో అంతర్లీనంగా పాండురంగడు ఉన్నాడని, ఆయన భజన గీతాలు ఆలపిస్తుంటే అర్థమవుతుందని తెలిపారు. జగ్గారెడ్డి భవగత్ సేవలోనే తరిస్తారని కితాబిచ్చారు.



మాట్లాడుతున్న సీపీ అనురాధ

కేసుల్లో శిక్షల శాతం పెంచాలి

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కేసుల్లో శిక్షల శాతం పెంచాలని సీపీ అనురాధ కోర్టు డ్యూటీ విధులు నిర్వహించే సిబ్బందికి సూచించారు. శనివారం ఆమె కోర్టు విధులు నిర్వహించే సిబ్బందితో కమిషనర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. క్రైం అగైనెస్ట్ ఉమెన్, ఎస్సీ, ఎస్టీ పోక్సో మర్డర్, దోపిడీ కేసుల్లో శిక్షల శాతం పెంచాలని సూచించారు. నిందితులకు శిక్షలు పడేట్లు సాక్షులను మోటివేషన్ చేయాలని తెలిపారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. సాక్షులను షెడ్యూల్ ప్రకారం తప్పకుండా కోర్టులో హాజరు పరచాలని సూచించారు. నేరస్థులకు కేసుల్లో శిక్షలు పడితేనే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. ప్రజల భద్రతా భావాన్ని పెంచడం మనందరి బాధ్యత అని చెప్పారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా విధు లు నిర్వహించి కన్విక్షన్ రేటు పెంచాలని సూచించారు. ప్రతి కోర్టు డ్యూటీ అధికారి నీతి నిజాయితీగా విధులు నిర్వహించాలని సూచించారు. కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి ఒక్కరూ నూతన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐలు, కోర్టు లైజనింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన సంగారెడ్డి

కదంతొక్కిన కామ్రేడ్స్

- తరలివచ్చిన కార్మిక, కర్షకులు
- తెలంగాణలో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్ర
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఉచిత బస్సు తప్ప ఒక్క హామీ అమలు కావడం లేదు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్. వీరయ్య



సంగారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో సీపీఎం శ్రేణులు



అభివాదం చేస్తున్న బృందాకారత్

సంగారెడి రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఎరుపెక్కింది. ఎర్రజెండాలు పట్టుకొని తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, కార్మిక, కర్షకులు పట్టణ వీధుల్లో కదంతొక్కారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్‌ఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళా నాయకులు, కార్యకర్తలు కోలాటలు ఆడుతూ నృత్యాలు చేస్తూ ముందుకుసాగారు. ర్యాలీలో సీపీఎం నాయకులు డా.బీఆర్ అంబేడ్కర్, నరేంద్ర మోదీ, కార్మికుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు ర్యాలీకి భారీగా తరలిరావడంతో సంగారెడ్డి పట్టణం ఎరుపెక్కింది. పట్టణంలో నిర్వహించిన

మిగతా 7వ పజీలో.

మరుగున మగ్గం

- హన్మంత్‌రావుపేట నేతన్నల వెతలెన్నో!
- నాడు నేతకారులతో గ్రామానికి గుర్తింపు
- నేడు ఆదరణ కరువై వలసబాట
- ఉన్న కొంతమంది ఇతర పనులకు..

7లో



హన్మంత్‌రావుపేట చేనేత సహకార సంఘంలో మూలన పడిన మగ్గాలు

ఇక.. ప్రత్యేక పాలన

ముగిసిన మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు

- ఉమ్మడి జిల్లాలో 15 పట్టణాలకు ప్రత్యేకాధికారులు
- సిద్దిపేట మున్సిపాలిటీకి మరో ఏడాదిన్నర గడువు
- ఈసారైన జహీరాబాద్‌కు ఎన్నిక జరిగేనా?
- కొవిడ్‌తో నిధుల కొరత.. కుంటుపడిన అభివృద్ధి
- నోటిఫికేషన్ కోసం ఆశావహుల ఎదురుచూపు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 25: మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు నేటితో ముగుస్తోంది. ఇప్పటిదాకా చైర్మన్లు, చైర్‌పర్సన్లు, కౌన్సిలర్ల నిర్వహణలో కొనసాగిన పట్టణాల పాలన ఇకపై ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లబోతోంది. ఇప్పటికే గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థల్లో అధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఉమ్మడి జిల్లాలో 21..

ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తంగా 21 మున్సిపాలిటీలు ఉండగా ఇందులో 15 చోట్ల పాలకవర్గాల గడువు ముగిసింది. సిద్దిపేటలో ఏడాదిన్నర గడువు ఉండగా.. జహీరాబాద్‌లో కోర్టు కేసు కారణంగా పదేళ్ల నుంచి ఎన్నికలే జరగలేదు. ఇక ఇటీవలే కోహీర్, గుమ్మడిదల, ఇస్నాపూర్, గడ్డ పోతారం మున్సిపాలిటీలను కొత్తగా ఏర్పాటు చేశారు. గడువు పూర్తయిన మునిపాలిటీలతో పాటే కొత్తవాటికీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

అధికారులే అంతా..

రేపటి నుంచి మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారులు రాబోతున్నారు. మున్సిపల్ కమిషనర్లు ఉన్నప్పటికీ ఇతర శాఖల ఉన్నతాధికారులను ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేయనున్న కొత్త పథకాల బాధ్యతనూ అధికారులే పర్యవేక్షించాల్సి ఉంది. లబ్ధిదారుల ఎంపిక, అమలు వీరికి సవాల్‌గా మారనున్నది. ఎన్నికలపై స్పష్టత లేకపోవడంతో అధికారుల చేతుల్లో మున్సిపాలిటీలు ఎప్పటిదాకా ఉంటాయనే విషయంపై స్పష్టత లేదు. నోటిఫికేషన్ కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నా.. పంచాయతీ, స్థానిక సంస్థల తరువాతే బల్దియాలకు ఎన్నికల జరగనుండడంతో ఆలస్యమయ్యే పరిస్థితి

మిగతా 7వ పజీలో.

గడువు పూర్తయిన మున్సిపాలిటీలు

సంగారెడ్డి జిల్లా
1, సంగారెడ్డి
2, అమీన్‌పూర్
3, తెల్లాపూర్
4, ఐడీఏ బొల్లారం
5, నారాయణఖేడ్
6, సదాశివపేట
7, ఆందోల్-జోగిపేట

సిద్దిపేట జిల్లా
1, గజ్వేల్-ప్రజ్ఞాపూర్
2, దుబ్బాక
3, హుస్నాబాద్
4, చేర్యాల

మెదక్ జిల్లా
1, మెదక్
2, నర్సాపూర్
3, రామాయంపేట
4, తూప్రాన్

లెక్క పక్కాగా ఉన్నట్లేనా..?

- నేటి నుంచి నాలుగు సంక్షేమ పథకాలు అమలుకు శ్రీకారం
- పలు పథకాలకు ఇంకా తేలని దరఖాస్తుల లెక్క
- శనివారం రాత్రి వరకు వెల్లడించని అర్హుల పేర్లు
- ఏయే పథకాలకు అర్హులెవరోనని ఎదురుచూస్తున్న ఆశావహులు

సిద్దిపేటటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డుసభలు నిర్వహించి అర్హుల వివరాలు, అభ్యంతరాలను స్వీకరించింది. సభలు పూర్తయి రెండు రోజులు గడుస్తున్నా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు, రైతు భరోసా లాంటి పథకాలకు అర్హులను తేల్చడంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

నేటి నుంచి శ్రీకారం..

ప్రభుత్వం ఈనెల 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులాంటి పథకాలకు శ్రీకారం చుట్టనున్నది. శనివారం రాత్రి వరకు కూడా అధికారికంగా వివరాలను మాత్రం వెల్లడించలేదు. దీంతో నేటి నుంచి అమలుకానున్న పథకాలకు తమ పేరు వస్తుందో లేదోనని అర్హులైన లబ్ధిదారులు, ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఫైనాలుగు పథకాలకు సంబంధించి నేడు అధికారికంగా లబ్ధిదారులకు ఏయే పథకం వర్తిస్తుందో వారికి ఎలాంటి పత్రాలు అందజేస్తారోనని వేచిచూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణానికి మంజూరైన వారికి ప్రొసీడింగ్ కాపీలు అందజేసినా ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు. వారిని కూడా ఈ పథకంలో చేర్చి అర్హులుగా గుర్తించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

రిపబ్లిక్ డే సందడి



గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్దిపేట సిద్ధమైంది. ఆదివారం జరిగే జాతీయ పతాకవిష్కరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మార్కెట్‌లో వివిధ సైజుల్లో త్రివర్ణ పతాకాలు విక్రయించారు. వాటితో పాటుగా స్పెషల్ డ్రెస్సులు, చేతి గాజులు, హ్యాండ్ బ్యాడ్జీలు, బెలూన్లు కొనుగోలు చేయడానికి పిల్లలు, పెద్దలు ఆసక్తి కనబరిచారు.

- సిద్దిపేట జిల్లా ఫొటోగ్రాఫర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి)



ప్రజాకాంక్షల మేరకు శాయశక్తులా పనిచేశాం

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాకాంక్షల మేరకు శాయశక్తులా పనిచేశామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. గజ్వేల్‌లోని మునిసిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన చివరి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో కరోనా కష్టకాలం వచ్చిందని, తమవంతుగా శాయశక్తులా మునిసిపల్ అభివృద్ధికి కృషిచేశామన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్తమ మునిసిపాలిటీగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌కు చోటు దక్కడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ సందర్భంగా ఏడు తీర్మాణాలను ప్రవేశపెట్టగా, సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు ఆయన మెమొంటోలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కౌన్సిలర్లు బొగ్గుల చందు, బాలమణి-శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మి-కనకయ్య, అర్చన-శివకుమార్, సీర్ల శ్యామల-మల్లేశం, బబ్బూరి రజిత, కూరాకుల శ్రీనివాస్, విద్యారాణి-శ్రీధర్, అబ్దుల్ రెహమాన్, చందన-రవిందర్, షేహానాజ్-సమీర్, అల్వాల బాలేష్, ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మి-దుర్గాప్రసాద్, దుంబాల లక్ష్మి-కిషన్‌రెడ్డి, శిరీషా, వంటేరు గోపాల్‌రెడ్డి, షబానాఉమర్, విజయలక్ష్మి-సత్యనారాయణ, ఇస్మాయిల్, గంగిశెట్టి రాజు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

రిపబ్లిక్ డే వేడుకలకు రావొద్దు

- ఓ ప్రైవేట్ పాఠశాల మైక్‌లో అనౌన్స్‌మెంట్
- గ్రామాలకు బస్సులూ రావని వెల్లడి
- విషయం ఎంఈవో దృష్టికి..
- ఆ తర్వాత సరిదిద్దుకున్న యాజమాన్యం

చేర్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే ఉత్సవాల విషయంలో ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చేర్యాలలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాట్లు చేయగా, ఓ పాఠశాల యాజమాన్యం మాత్రం రిపబ్లిక్ డే వేడుకలకు విద్యార్థులు హాజరు కావొద్దంటూ శనివారం సాయంత్రం పాఠశాల మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేసింది. అలాగే, ఆయా గ్రామాల నుంచి బస్సుల్లో విద్యార్థులను తరలి స్తుండగా.. రేపు ఉదయం గ్రామానికి బస్సు రాదంటూ తల్లిదండ్రులకు కూడా చెప్పారు. విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ.. వారిలో జాతీయ భావాన్ని పెంపొందించాల్సిన పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయంపై పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకురావడంతో.. ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఎంఈవో రచ్చ కిష్టయ్య దృష్టికి తీసుకువెళ్లారు. ఏం జరిగిందో కాని, కాసేపటి తర్వాత పాఠశాల యాజమాన్యం తన స్కూల్ వాట్సాప్ గ్రూప్‌లో రిపబ్లిక్ డే వేడుకలకు హాజరుకావాలని విద్యార్థులకు మెసేజ్ పెట్టారు. ఈ విషయమై బీజేపీ రాష్ట్రనాయకుడు బూరుగు సురేశ్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలపై చిన్నచూపు చూసిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటే వజ్రాయుధం

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు అనేది ఒక వజ్రాయుధమని, సమాజా న్ని మార్చడానికి ఒక ఆక్సిజన్‌లా పనిచేస్తుందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం సిద్దిపేటలో 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. నేటితరం యువతకు ఓటు విలువ, ఎన్నికల ప్రక్రియను తెలియజేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, నూతన ఓటరు దరఖాస్తు కొరకు ఫారం-6, అడ్రస్ మార్పునకు ఫారం-8 ఇతరత్రా ఓటరు దరఖాస్తు ప్రక్రియపై యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటరు దినోత్సవం పురస్కరించుకుని వివిధ పాఠశాల, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, మున్సిపల్ కార్యలయంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచిన మహిళలకు, గ్రామస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన బీఎల్‌వోలకు, కార్యక్రమం నిర్వహణకు కృషి చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గీత, తహసీల్దార్లు వెంకటేష్, సలీం, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, డిగ్రి కళశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి



ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

భూమి కబ్జా చేసి, దాడి చేశారు

పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
మాజీ మంత్రి నిమ్మ రాజారెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ నాయకుల ప్రోత్సాహం, అండదండలతో తన భూమిని కబ్జా చేసి, తన భార్యపై దాడి చేశారని మాజీ మంత్రి నిమ్మ రాజారెడ్డి తనయుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం, గాగిల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 8/1లో తనకు 7.31 ఎకరాల భూమి ఉన్నదని, అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్, మాజీ మంత్రి రెండో కుమారుడు సంజీవరెడ్డి తనయుడు చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డితో కుమ్మక్కై కబ్జా చేశారని మండిపడ్డారు. మాజీ మంత్రి రాజారెడ్డి సంపాదించిన ఆస్తులకు సంబంధించి కుటుంబసభ్యులు క్రయవిక్రయాలు జరపకూడదని 2011 నవంబరులో కోర్టు ద్వారా మధ్యంతర ఉత్తర్వులు జారీఅయ్యాయని తెలిపారు. అయినప్పటికీ కోర్టు ఆదేశాలను దిక్కరించిన మేక సంతోష్, నిమ్మ రాజీవ్‌రెడ్డి, చిలివేరు వెంకట్‌రెడ్డి భూమిని కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదేమిటని అడిగినందుకు తన భార్య నిమ్మ అనితపై దాడి చేశారని, దుర్భషలాడుతూ తన మొబైల్ ఫోన్‌ను పొలంలోకి విసిరివేశారని తెలిపారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, రెండు సెల్‌ఫోన్లు, కొంత డబ్బును దౌర్జన్యంగా తీసుకెళ్లారని పేర్కొన్నారు. పోలీసుల దృష్టికి కబ్జా విషయాన్ని తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. దాడి విషయాన్ని, కోర్టు మధ్యంతర ఉత్తర్వుల పత్రాలతో సహా తన భార్య అనితతో కలిసి పోలీస్ అధికారులు, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ బేఖాతర్ చేస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి వాపోయారు.



భూమి పత్రాలను చూపుతున్న నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, ఆయన భార్య అనిత

అంగన్‌వాడీలో గడువు తీరిన సిరప్

15 నెలల పాపకు తాగించగా.. ఆందోళనలో తల్లిదండ్రులు



గడువు తీరిన సిరప్

చిలప్‌చెడ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలో ఇచ్చిన సిరప్‌ను పాపకు తాగించిన తల్లిదండ్రులు.. అది గడువు తీరిందని తెలిసి ఆందోళన చెందుతున్న సంఘటన చిలప్‌చెడ్ మండలం పరిధిలోని జగ్గంపేటలో శనివారం చోటుచేసుకున్నది. పాప తండ్రి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తమ పాపకు 15 నెలల టీకా ఉండడంతో శనివారం అంగన్‌వాడీలో టీకా ఇప్పించగా, వారు జ్వరం సిరప్ ఇచ్చారు. దాన్ని చూడకుండా పాపకు తల్లి తాగించింది. తాను డ్యూటీ నుంచి వచ్చాక సిరప్ బాటిల్‌ను పరిశీలించగా సెప్టెంబర్ 2024లోనే గడువు ముగిసిందని తెలిసింది. ఎలా ఇచ్చారని ఆశా వర్కర్‌ను అడగగా, చూడకుండా ఇచ్చినట్లు బుకాయిస్తుందని తండ్రి నరేష్ తెలిపారు. వెంటనే పాపను సిరిపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా పాపను పరిశీలించిన వైద్యుడు ప్రస్తుతం బాగానే ఉందని, జాగ్రత్తగా చూసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వ సిబ్బంది నిర్లక్ష్యంతో చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వారు మండిపడ్డారు.

దేశ, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన విద్యను నేర్పించాలి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కొణిదెల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కొణిదెల లక్ష్మీనారాయణ

జహీరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : దేశ, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన విద్యను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అందించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కొణిదెల లక్ష్మీనారాయణ అన్నారు. జహీరాబాద్ పట్టణ సమీపంలోని రావూస్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తయారుచేయాలని, లక్ష్యాలను వారికే వదిలేయాలని, తల్లిదండ్రుల జోక్యం అంతగా అవసరం లేదన్నారు. వారి ఇష్టాలను వారికే వదిలేస్తే రంగం ఏదైనా అద్భుతంగ రాణిస్తారన్నారు. విద్యార్థుల్లో వారిలో దాగి ఉన్న సహజసిద్ధమైన ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. మారుతున్న కాలనుగుణంగా విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఊహించని ప్రశ్నలు అడిగే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పుస్తకాలను చదివితే జ్ఞానం వస్తుందని.. సమాజం, ప్రకృతిని, ఇతరుల జీవితాలను చదివితే విజ్ఞానం వస్తుందని, తనను తాను చదివితే దివ్య జ్ఞానం వస్తుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. తరగతి గదుల్లో ఉండే ప్రతీ విద్యార్థి మేధావియేనని, ఒక్కొక్కరికి ఒక్కోరకమైన అంశాలపై పట్టు ఉంటుందన్నారు. విద్యార్థులు మాతృభాషపై మరింత పట్టును పెంపొందించుకుంటూ ప్రపంచ భాషలను నేర్చుకుంటే ఎక్కడైనా రాణిస్తారనే విషయాన్ని గమనించాలన్నారు. విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న రావూస్ సంస్థ పనితీరును ఆయన అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రావూస్‌పాఠశాల నిర్వాహకులు నవీన్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, తల్లిదండ్రులు, ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం

జహీరాబాద్, జనవరి25 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త స్వామి, డీడీఎస్ మహిళా రైతులు చంద్రమ్మ, పూలమ్మ పేర్కొన్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బౌలితండాలో పాత పంటల జాతరను నిర్వహించారు. ఎడ్లబండ్ల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం చిరుధాన్యాల వంటకాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. రైతులు విధిగా చిరుధాన్యాల పంటలను సాగుచేసుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వినయ్‌కుమార్, మంజుల, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర




ఖైదీల ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి భవానిచంద్ర

కంది, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అర్జీ పెట్టుకున్న ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు ఖైదీల కోసం న్యాయ సహాయ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె జైలులోని అన్ని బ్లాకులను, ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటశాలను పరిశీలించారు. ఖైదీలకు అందించే ఆహారంలో నాణ్యత లో లోపం ఉండకూడదని జైలు అధికారులకు సూచించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పనితీరును ఖైదీలకు వివరించారు. సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు లేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.రమేష్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ దేవదాస్, జైలు సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్, డిప్యూటీ సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డి, జైలర్ మహిపాల్‌రెడ్డి, డిప్యూటీ జైలర్లు గౌతమ్, రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో

సంగారెడ్డి ఉపాధ్యాయుడికి రెండో స్థానం



జ్ఞాపికను అందుకుంటున్న ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పుదుచ్చేరిలో ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో సంగారెడ్డి జిల్లా నుంచి టీచర్ ఎగ్జిబిట్‌లో ర్యాలమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్ రెండో స్థానంలో నిలిచారు. 'గణిత భావనలను సులభంగా అర్థం చేసుకోవడం' ప్రాజెక్టు ద్వారా 1 నుంచి 10వ తరగతి వరకు గణితానికి సంబంధించిన అంశాలను సులభంగా నేర్చుకోవడానికి తయారుచేసిన నమూనాలకు గుర్తింపు దక్కింది. 'లైఫ్ సేవర్ స్టిక్ ఫర్ ఫార్మర్స్' ఎగ్జిబిట్ రూపొందించిన పటాన్‌చెరు మండల ఇస్నాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి అంకిత్‌కుమార్, శాంసన్, గైడ్ టీచర్ భాస్కర్‌దేశ్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. వీరికి పుదుచ్చేరి స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి నమ:శివాయ ప్రశంసాపత్రం, బహుమతి అందజేశారు. ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్, విద్యార్థులను కలెక్టర్ క్రాంతి, డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి అభినందించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై

దాడి ఘటనలో 42మందిపై కేసు

పటాన్‌చెరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి క్యాంపు కార్యాయలంపై గురువారం దాడికి పాల్పడిన ఘటనలో 42 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ నేత కాటశ్రీనివాస్‌గౌడ్ ప్రోద్బలంతో దాడి చేసి రూ.10వేల విలువైన ఫర్నీచర్ ధ్వంసం చేశారని క్యాంపు కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ కిష్టంగారి రాజు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భారత న్యాయ సంహిత సెక్షన్ 3 ఆఫ్ పీడీపీపీ ఆక్ట్, 189(3), 190, 329(4), 324 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ వినాయక‌రెడ్డి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇంత పెద్ద ఎత్తున ఒకే సారి 42మంది ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

మరుగున మగ్గం



హన్మంత్‌రావుపేటతో తెగిన 'పోగు'బంధం

ఒకప్పుడు చక చక మంటూ చేనేత కుటుంబాలకు అదెరువైన మగ్గం నేడు ఆదరణ లేక మూలన పడి మూగబోయింది. నాడు నైపుణ్యమైన నేతకారులతో ప్రసిద్ధిగాంచిన ఆ ఊరు ఇప్పుడు వలసలతో వెలవెలబోతున్నది. ఉన్న కొంతమంది కూడా బీడీ కార్మికులుగా మారి బతుకు బండిని లాగుతున్నారు. గ్రామంలోని సగం కుటుంబాలు చేనేతలవే కాగా, చాలామంది పొట్ట చేతబట్టుకుని ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లారు. దీంతో వారి ఇళ్లు శిథిలావస్థకు చేరి చేనేతల దుర్భర జీవన స్థితికి అద్దం పడుతున్నాయి.

-నారాయణఖేడ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి)



- నాడు నేతకారులతో గ్రామానికి గుర్తింపు
- నేడు ఆదరణ కరువై వలసబాట
- ఉన్న కొంతమంది ఇతర పనులకు..
- గ్రామంలో సగం కుటుంబాలు చేనేతలవే
- శిథిలావస్థకు చేరిన వలసదారుల ఇళ్లు

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలో కులవృత్తిపై ఆధారపడిన నేత కార్మికులు ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. నేత కార్మికులతో నాడు గ్రామానికి ప్రత్యేక గుర్తింపు వచ్చినప్పటికీ, ప్రభుత్వ ఆదరణ లేక కార్మికులు వలస వెళ్లడంతో గ్రామంలోని కార్మికుల గృహాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఉన్న నేత కార్మికులు ఉపాధి కోసం దిక్కులు చూస్తున్నారు. కొందరు కులవృత్తిని వీడి ఇతర వృత్తులతో కొనసాగడమే కాకుండా, మరి కొందరు బీడీ కార్మికులుగా ఉపాధి పొందుతున్నారు. గ్రామంలో పెద్దగా సాగు భూములు లేకపోయినప్పటికీ నేత కార్మికులు కుల వృత్తిని ఆసరాగా చేసుకొని, గతంలో చక్కటి నైపుణ్యంతో వస్త్రాలను నేసేవారు. నేత కారులను ప్రోత్సహించడం కోసం ఆ గ్రామానికి చెందిన గోనికే చంద్రయ్య చేనేత సహకార సంఘాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ప్రభుత్వం ద్వారా ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడంతో సహకార సంఘం కూడా సక్రమంగా పని చేయడం లేదు. దీంతో నేత కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

బీడీలతో ఆదాయం అంతంతే



తమ కుల వృత్తిలో ఉపాధి లేక బీడీలు చుడుతున్న ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. దీనివల్ల తమ ఆరోగ్యంకూడా దెబ్బ తింటుంది. ఈ వృత్తి ద్వారా కూడా కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు.

- అంబటి ఈశ్వరమ్మ, బీడీ కార్మికురాలు



నేత కార్మికులు వలస వెళ్లడంతో శిథిలావస్థకు చేరిన కార్మికుల గృహం

చాలా కుటుంబాలు వలస..

హన్మంత్‌రావుపేటలో 2000 వరకు జనాభా ఉండగా, దాదాపు 1500 మంది వరకు ఓటర్లు ఉన్నారు. గ్రామ శివారులో కేవలం 337 ఎకరాల సాగు భూమి మాత్రమే ఉంది. గ్రామంలోని 449 కుటుంబాల్లో సగం చేనేతలవే ఉంటాయి. ప్రస్తుతం చేనేతకు ఆదరణ లేక ఉపాధి లేకపోవడంతో చాలావరకు కుటుంబాలు పొట్ట చేతబట్టుకుని ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లారు. వృత్తిపై ఆధారపడిన పలువురికి పెన్షన్‌లు కూడా అందడం లేదని నేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేత కార్మికుల కుటుంబాల్లో దాదాపు 100 మంది వరకు బీడీ కార్మికులు ఉన్నప్పటికీ ప్రస్తుతం పొగాకు ఉత్పత్తులకు గిరాకీ తగ్గడంతో ఉపాధి కరువైందని వాపోతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నేత కార్మికులకు పూర్వ వైభవం తీసుకువస్తామని తెలుపడంతో, తాము ఆనందంగా ఉన్నామని, ఈ ప్రభుత్వంలోనైనా తమకు ఆదరణ లభిస్తుందని వారు గంపెడాశతో ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి..



ప్రస్తుత ప్రభుత్వంలోనైనా చేనేతల సమస్యలను పరిష్కరించాలి. తాము కులవృత్తిపై ఆధారపడడంతో ఇతర పనులు చేయలేకపోతున్నాం. దీంతో పూట గడవడమే కష్టంగా ఉన్నది. ప్రభుత్వం గమనించి చేనేతల కుటుంబాల ప్రోత్సహించి ఆదుకోవాలి.

- మాటూరి నారాయణ, నేత కార్మికుడు

నేత కార్మికుల భరోసా కల్పించాలి..



నేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. గతంలో గ్రామ నేత కార్మికులందరం చక్కటి నైపుణ్యంతో వస్త్రాలు నేసేవారం. ప్రోత్సాహం లేకపోవడంతో ఇప్పటికే అనేక మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రభుత్వం చేనేత కార్మికుల్లో భరోసా కల్పించి వలసలను అరికట్టాలి.

- అంబాదాస్, చేనేత సహకార సంఘం బాధ్యులు

ఇక.. ప్రత్యేక పాలన

(5వ పేజీ తరువాయి)

కనిపిస్తుంది. ఎన్నికలు పూర్తయ్యి కొత్త పాలకవర్గాలు కొలువు దీరాలంటే కనీసం ఏడాదైనా పట్టవచ్చని భావిస్తున్నారు.

జహీరాబాద్ ఎన్నికపై ఉత్కంఠ

సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ మున్సిపాలిటీకి గత 10 సంవత్సరాలుగా ఎన్నికలు జరగలేదు. హోతి.కె అనే గ్రామాన్ని పదేళ్ల క్రితం జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఆ గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాన్ని పంచాయతీగానే ఉంచాలని, మున్సిపాలిటీలో విలీనం చేయవద్దని పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడ ఎన్నిక నిర్వహించవద్దని హైకోర్టు నుండి ఉత్తర్వులు వచ్చాయి. అయితే మున్సిపాలిటీ తరఫున హైకోర్టులో వాదనలు వినిపించగా ఈ కేసును కొట్టివేశారు. మళ్లీ గ్రామస్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అందుకే పదేళ్ల నుంచి ఇక్కడ ఎన్నికలు జరగలేదు. ఈ సమస్య కొలిక్కివచ్చి ఈసారైనా ఎన్నికలు జరుగాయా.. లేదా అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సిద్దిపేటకు 15నెలల గడువు

సిద్దిపేట మున్సిపాలిటీ పాలకవర్గానికి ఇంకా 15 నెలల గడువు ఉంది. ఇక్కడ 2021 మే నెలలో ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల ఎన్నికలకు సిద్దిపేట ఎన్నిక భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే పదేళ్ల క్రితం మున్సిపాలిటీలో పక్కనున్న గ్రామాల విలీనం వివాదంగా మారింది. గ్రామస్థులు కోర్టును ఆశ్రయించడంతో దాదాపు 6 సంవత్సరాల పైనే ఇక్కడ ఎన్నికలు జరగలేదు. ఆ తర్వాత వివాదం సద్దుమణగడంతో ఎన్నికలు జరిగాయి. 2026 మే 5వ తేదీతో సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం గడువు ముగుస్తుంది.

మానవతా దృక్పథంతో

బాధిత రైతుకు పట్టా



మహిళా రైతుకు సన్మానం చేస్తున్న తహసీల్దార్

చిన్నశంకరంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మానవతా దృక్పథంతో ఓ మహిళా రైతు తన పేరున ఉన్న కొంత భూమిని బాధిత రైతుకు పట్టా చేసింది. వివరాలకు వెళ్తే చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పోసగల్ల బాలమ్మకు 2014లో గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ కింద 1158 సర్వే నెంబర్ గల మూడెకరాల భూమిని పంపిణీ చేసింది. 2018లో తన భూమి నుంచి 8 గుంటలు భూమి అదే గ్రామానికి చెందిన యశోద పేరు మీద నమోదైంది. తిరిగి బాధిత రైతు పేర మార్చాలంటే ధరణి పోర్టల్ ద్వారా తప్పా మరో మార్గం లేదు. బాధిత రైతు గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. దీంతో వారందరూ యశోదతో మాట్లాడగా.. ఆమె న్యాయంగా ఆలోచించి బాధిత రైతుకు ధరణి పోర్టల్ స్లాట్ బుక్ చేసి పట్టా చేయించారు. యశోదను తహసీల్దార్ మన్నన్ శాలువాతో సన్మానించి అభినందించారు.

ఇంజనీర్స్ ట్రోఫీ విజేతగా మిషన్‌భగీరథ



మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25: పని ఒత్తిడిలో నిత్యం విధులు నిర్వహించే ఉద్యోగులు స్నేహపూర్వక కలయికగా క్రికెట్ ట్రోఫీ ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలోని మిషన్‌భగీరథ, పంచాయతీరాజ్ ఇంజనీర్లు ఆటవిడుపుగా సరదాగ గడిపారు. ఇరు శాఖల అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పోటీలో నిలిచారు. 12 ఓవర్ల మ్యాచ్‌లో ఒక్క పరుగు తేడాతో పంచాయతీ ఇంజనీర్ల బృందంపై మిషన్‌భగీరథ ఇంజనీర్ల బృందం విజయం సాధించింది. కార్యక్రమంలో మిషన్‌భగీరథ చీఫ్ ఇంజనీర్ డి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ జగదీశ్వర్, ఈఈ నర్సింహులు, మిషన్‌భగీరథ గ్రిడ్ ఈఈ నాగభూషణం, ఇంట్రా ఈఈ సంపత్, డిప్యూటీ ఇంజనీర్లు పాండురంగారెడ్డి, విజయభాస్కర్, శ్రీనివాస్‌లు, అమరేశ్వర్, పవన్ తదితరులు ఉన్నారు.

ఆమె వితంతువు.. అతడు వివాహితుడు

● పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

రామాయంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆమె వితంతువు, అతనూ వివాహితుడు. ఇద్దరిది ఒకే ఊరు వారిద్దరి పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి మోసం చేశాడు. వివరాల్లోకి వెళ్లితే రామాయంపేట మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త మరణించడంతో కొన్నేళ్లుగా పుట్టింట్లోనే ఉంటుంది. ఇదే గ్రామానికి చెందిన గజం లింగమూర్తితో ఆమెకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇదే అదునుగా మాయ మాటలు చెప్పి లోబర్చుకోవడంతో పాటు 5 తులాల బంగారు నగలు, రూ. రెండు లక్షలు కాజేశాడు. తీరా పెళ్లికి నిరాకరించాడు. తీసుకున్న నగదు, నగలు కూడా ఇవ్వనని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో మోసపోయిన గ్రహించిన బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎరుపెక్కిన సంగారెడ్డి



(5వ పేజీ తరువాయి)

సభలో నాయకులు మాట్లాడారు.

బీజేపీని రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వొద్దు

ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రసంగిస్తూ తెలంగాణలో హిందూ ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. భూమి కోసం భుక్తి కోసం ఆనాడు సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో హిందూ, ముస్లిం, సిక్కులతో సహా అన్నివర్గాలవారు పాల్గొన్నారని గుర్తుచేశారు. కుల మతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీని సకలశక్తులు ఏకమై తెలంగాణలో అడుగుపెట్టనివ్వవద్దని పిలుపునిచ్చారు. సమరశీల పోరాటలకు సీపీఎం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. బీజేపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా పరోక్షంగా సహకరిస్తుందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో దళితులపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. ప్రజాసమస్యలపై పోరాడే సీపీఎం నాయకులను అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు ఇచ్చిన కాంగ్రెస్ మహిళలకు ఉచిత బస్సు తప్ప ఏ ఇతర హామీనీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండడంతో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పేరుతో తిరిగి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని చూశామని, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారుని చూస్తున్నామని.. రెండు పార్టీలు రూ. లక్షల కోట్లు దోచుకోవడంపై చూపిన శ్రద్ధ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చూపలేదన్నారు. ప్రజాసమస్యలు పరిష్కారం కావాలంటే సీపీఎం పార్టీ బలబడాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు మాణిక్యం, సాయిలు, అశోక్, దత్తు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

మద్యం తాగొద్దన్న భార్య.. భర్త ఆత్మహత్య

కుకునూరుపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఒడిశా రాష్ట్రానికి చెందిన బసంత్‌నాహక్(30) భార్య భాగ్యతో కలిసి నాలుగు నెలల క్రితం మండలంలోని బొప్పాయిపల్లి శివారులోని పౌల్ట్రీ ఫామ్‌లో పని కోసం వచ్చారు. నాహక్ నిత్యం మద్యం తాగుతుండడంతో భార్య మానేయాలని చెప్పింది. శుక్రవారం కుకునూరుపల్లిలో సంతకు వెళ్లిన బసంత్ మళ్లీ మద్యం తాగి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు గుర్తు తెలియని మందు తాగాడు. గమనించిన భార్య గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీరికి రెండు సంవత్సరాల బాలుడు ఉన్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

● సీపీ ఆఫీసు దగ్గర ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

సిద్దిపేట అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చుంచనకోట గ్రామానికి చెందిన ఆది రాములు తన వ్యవసాయ భూమికి సంబంధించిన తగాదా విషయంలో గతంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. సీపీ సమస్యను పరిష్కరించాలని చేర్యాల సీఐకి సూచించినా పరిష్కారం కాలేదు. దీంతో శుక్రవారం మరోసారి సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు రాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రాములు పురుగుల మందు తాగి వచ్చిన విషయాన్ని గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాములు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమస్య పరిష్కారం కోసం పురుగుల మందు తాగి అధికారులను బెదిరించిన విషయంలో రాములుపై త్రీ టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. కాగా రాములుకు చెందిన విద్యుత్ స్టార్టర్, పైపులు ధ్వంసం చేసిన విషయంలో ఆది శ్రీనివాస్, మరి కొంత మందిపై చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ నీరేశ్ తెలిపారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి

నంగునూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నంగునూరు గ్రామానికి చెందిన కన్నారం జంపయ్య (45) శనివారం అక్కెనపల్లి మోయతుమ్మెద పెద్ద వాగులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాజగోపాల్ పేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మల్లన్న సన్నిధిలో పుణ్యస్నానాలకూ ఇక్కట్లే..

- హామీలు గాలికి.. పునరుద్ధరణకు నోచుకోని ఆలయ కోనేరు
- రూ. లక్షలు వెచ్చించి నీటిశుద్ధీకరణ యంత్రం ఏర్పాటు చేసినా నిష్ప్రయోజనమే
- నీరు కలుషితమైనా పట్టించుకోని అధికారులు
- అవే నీటిలో స్నానం చేస్తే చర్మరోగాలు సోకే ప్రమాదం
- ఆరుబయట బోరుబావులే దిక్కు


కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలోని కోనేరులో వ్యర్థాల మధ్య భక్తుల స్నానాలు


నీరు కలుషితం కావడంతో వ్యవసాయ బోరుబావి వద్ద భక్తుల స్నానాలు


నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధీకరణ యంత్రం

చేర్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాలు, ఆలయపరిసరాల్లోని కోనేర్లు, కుండాలలో పుణ్యస్నానాలు చేస్తే పాపాలు హరించిపోతాయని భక్తుల ప్రగాఢవిశ్వాసం. అందువల్ల ప్రముఖ ఆలయాల పరిసరాల్లో గల కోనేర్లలో భక్తులు కుటుంబ సమేతంగా కనీసం మూడు మునకలైనా మునిగి పుణ్యస్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కోరమీసాల కొమురవెల్లి మల్లన్న ఆలయం కోనేరులో పుణ్యస్నానాలు చేయడం భక్తులకు ఇబ్బందిగా మారింది. కోనేరులో అపరిశుభ్రంగా ఉన్న నీటి దుర్వాసన భరించలేక 'మొక్కుబడి'గా ముక్కుమూసుకుని ఇబ్బందులుపడుతున్న పరిస్థితి నెలకొంది.

హామీలు గాలికి..

కొమురవెల్లి మల్లన్న సన్నిధికి సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు ఆలయప్రాంగణంలోని కోనేరులో పుణ్యస్నానమాచరించడం అనాదిగా వస్తున్న ఆచారం. గోదావరి జలాలతో పుణ్యస్నానమాచరించేలా చర్యలు తీసుకుంటామని చాన్నాళ్లక్రితం ప్రజాప్రతినిధులు ప్రకటించినా, కోనేరు పునరుద్ధరిస్తున్నట్లు ఆలయవర్గాలు వెల్లడించి ఆరేళ్లు గడిచిపోయినా అమలుచేపట్టకపోవడంతో భక్తుల మనోభావాలకు భంగం కలుగుతుంది. కనీసం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలోనూ నిర్లక్ష్యం వహిస్తుండటంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిల్వ నీటిలో స్నానాలతో దుర్వాసన

మూడునెలలపాటు కొనసాగే ఉత్సవాల సమయంలో వేలాదిగా, సాధారణ రోజుల్లో ప్రతీ ఆదివారం వందలాదిగా భక్తులు తరలివస్తున్నారు. స్నానాల కోసం కోనేరులో నీటిని నింపిన ఆలయవర్గాలు రెండు, మూడురోజులపాటు అలానే నిల్వచేస్తుండటంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. దుర్వాసన కారణంగా భక్తులు కోనేరులో స్నానం చేయడానికి జంకుతూ ఆరుబయట వ్యవసాయ బావుల వద్దకు లేదా ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన పంపుల వద్ద డబ్బులు చెల్లించి స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. కోనేరులో కలుషితమై రంగుమారిన నీటిలో స్నానాలు చేస్తే పుణ్యం మాటేమోగాని చర్మవ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు భక్తులు అవే నీటిలో ముక్కు మూసుకుని స్నానాలు చేస్తుండటం గమనార్హం.

శుద్ధీకరణ యంత్రం ఏర్పాటు చేసినా..

భక్తులు స్నానాలు చేస్తున్న క్రమంలో పసుపు, కుంకుమ చల్లి, కొబ్బరికాయలు కొడుతున్నారు. ఈ క్రమంతో చెత్త, చెదారం పేరుకుపోకుండా, నీరు రంగు మారకుండా ఉండేందుకు చాన్నాళ్లక్రితమే సుమారు రూ.9లక్షలు వెచ్చించి శుద్ధీకరణయంత్రాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణకు సంబంధించి ప్రతి నెలా వేలాది రూపాయలు వేతనం చెల్లిస్తూ సిబ్బందిని కూడా నియమించారు. కానీ కొన్నాళ్లపాటే నిర్వహించి చేతులు దులుపుకోవడంతో శుద్ధీకరణయంత్రం నిరుపయోగంగా మారింది. శుద్ధీకరణ యంత్రం మరమ్మతుల నిర్వహణకు ఆలయవర్గాలు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ప్రస్తుం జాతరలో రెండోవారం కొనసాగుతున్నది. మరికొన్నివారాలు జాతర జరగనున్నందున లక్షలాదిమంది తరలిరానున్న క్రమంలో ఆలయవర్గాలు, అధికారులు తగిన చర్యలు తీసుకుని పుణ్యస్నానాలు చేసే భక్తులకు కలుషితనీటినుండి ఉపశమనం కలిగించాలని కోరుతున్నారు.

పునరుద్ధరణకు రూ.10లక్షలు అవసరం

చాలా ఏళ్లక్రితం మల్లన్న కోనేరును నిర్మించడంతో కాలక్రమేణా లోతట్టుమయమైంది. కోనేరులో నిల్వచేసిన నీరు ఎప్పటికప్పుడు బయటకు పంపించడంతో పాటు శివుడి విగ్రహ సుందరీకరణ, కోనేరు ఆధునీకరణకు సుమారు రూ.10లక్షల వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. కానీ ఏళ్లు గడిచినా పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు


క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

మద్దూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిల్లాపూర్‌కు వెళ్లే ఎల్లమ్మ ఆలయం వద్ద శనివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం గాగిల్లాపూర్‌కు చెందిన యామ సాయిచందన తన బాబాయి యామ బాబుతో కలిసి ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో బంజర గ్రామానికి చెందిన నిమ్మలస్వామి బైక్‌పై గాగిల్లాపూర్‌కు వచ్చే క్రమంలో ఎల్లమ్మ ఆలయం ముందు గల మూల మలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను చేర్యాల ఆస్పత్రికి తరలించారు.

న్యాయం చేయాలంటూ మృతదేహంతో ఆందోళన


తాడూరులో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

చేర్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామ శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఘనపురం కరుణాకర్ (28)చికిత్స పొందుతూ మృతి చెందాడు. అందుకు చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యాజమాని బాధ్యత వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మృతుడి బంధువులు గ్రామంలో మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోవడంతో సీఐ శ్రీను, ఎస్ఐ నీరేశ్‌లు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. స్థానిక పోలీసులు కూడా ఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపచేయడంతో ఆందోళన విరమించుకున్నారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

చిన్నకోడూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పెండింగులో ఉన్న మెడికల్, జీపీఎఫ్, లోన్స్ పార్ట్ ఫైనల్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ జానకి రాములు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శనివారం టీపీటీఎఫ్ నాయకులు సందర్శించారు. సమస్యల సేకరణ కార్యక్రమం చేపట్టి, టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉపాధ్యాయుల బిల్స్ రాక మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు మహేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దేవరుషి, ఉపాధ్యక్షులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికుల కోసం కాటమయ్య రక్షణ కవచం

● సేఫ్టీ మోకుతో కార్మికులకు రక్షణ


మిట్టపల్లిలో గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు

సిద్దిపేట అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాటమయ్య రక్షణ కవచం గీత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇది రక్షణ కవచంగా నిలుస్తుందని ట్రైనర్లు జాగిరి అంజి గౌడ్, పొన్నం వెంకటేష్‌గౌడ్, తోడేటి జితేందర్ గౌడ్, అనగొని నర్సింహులుగౌడ్ తెలిపారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ఎల్లమ్మ తాటివనంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం(సేఫ్టీమోకు)పై అవగాహన కల్పించి మాట్లాడారు. సిద్దిపేట బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్మికులకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. సేఫ్టీ మోకులపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించి ప్రాణాలకు అపాయం కలవకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్షణ కవచాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిపేట డివిజన్ పరిధిలోని రాజగోపాలపేట, నర్మెట్ట, రాఘవాపూర్, జక్కాపూర్, చింతమడక, వెల్కటూరు, తదితర గ్రామాల గీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్థుల ఫిర్యాదు


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీదేవిపల్లి గ్రామస్థులు

సిద్దిపేట రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో గ్రామ పంచాయతీ కార్యదర్శి డబ్బులు తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేశాడని నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామస్థులు ఆరోపించారు. శనివారం నారాయణరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీరాములుకు, తహసీల్దార్ హైమద్‌ఖాన్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ఇంటింటికీ వెళ్లి ఫొటోలు తీశాడని, అయితే బిల్డింగ్ ఉన్నవారికి గుడిసెలో ఉంటున్నట్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్ చేశారని, అలాంటి వారి పేర్లను లబ్ధిదారులుగా ఎంపిక చేసి గ్రామసభలో జాబితా ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఇల్లు లేకుండా ఉన్న నిజమైన అర్హులకు జాబితాలో చోటు దక్కలేదని వాపోయారు. ఎస్సీ కాలనీలో ఇద్దరు వ్యక్తులకు రెండు ఇళ్లు ఉన్నాయని, మెయిన్ రోడ్డులో ఇళ్లు ఉన్నప్పటికీ, మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో వారి పేర్లు వచ్చాయని తెలిపారు.

అర్హుల జాబితాలో పేర్లు వచ్చిన ఆ ఇద్దరి పేర్లు తొలగించి లక్ష్మీదేవిపల్లి ఇన్‌చార్జి కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ది బిక్షపతి, దండు భాస్కర్, కైలాసం, జగన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్‌ప్రవర్తనతో మెలగాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేట క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జైలులో ఖైదీలు సత్‌ప్రవర్తనతో మెదులుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి సూచించారు. శనివారం సిద్దిపేట జైలులో ఏర్పాటుచేసిన లీగల్ అవేర్నెస్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖైదీల హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఖైదీలు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నుంచి న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఖైదీలు తమ సమస్యలను లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు తెలిపితే వారు న్యాయపరమైన సలహాలు ఇస్తారని తెలిపారు. ఖైదీలు ఏదైనా న్యాయపరమైన సలహాల కోసం 15100కు కాల్ చేయవచ్చని సూచించారు. అనంతరం డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ స్వాతి రెడ్డి మాట్లాడుతూ.. ఖైదీలకు అవసరమైన అన్ని వస్తువులను కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నదన్నారు. జైలు సూపరిండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా ధర్మారం

మద్దూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని ధర్మారం, దూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా ఎంపికైనట్లు జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మద్దూరులో విలేకరులతో మాట్లాడారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గజ్వేల్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఎంఈవో కృష్ణ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ మండలం సింగాటం ప్రాథమిక పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నారన్నారు. ప్రతి నెల నాలుగవ శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిపై చర్చిస్తున్నారని అన్నారు.

'గజ్వేల్-ప్రజ్ఞాపూర్' అభివృద్ధికి కృషి

గజ్వేల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ అభివృద్ధికి కృషి చేస్తానని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని 13వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ షెహనాజ్-సమీర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వెంట గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ భాస్కర్, నాయకులు ఉన్నారు.

'మత్తు'కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

చిన్నకోడూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువత తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్ఐ వెంకటయ్య సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణలో భాగంగా చిన్నకోడూరులో పోలీసులు శనివారం సాయంత్రం నార్కోటిక్స్ డాగ్స్‌తో కిరాణషాపులు, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నా, విక్రయించినా వెంటనే డయల్ 100కు లేదా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నంబరు 1908కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



మిరుదొడ్డిలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వాహనదారులందరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు సూచించారు. శనివారం జాతీయభద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశనుండే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

రేబర్తి పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

మద్దూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వరదరాజు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి డ్రాయింగ్ పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పోటీలో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రభాను, ఉపాధ్యాయులు శిరీష, సంపత్, చంద్రారెడ్డి, మల్లేశం, నర్సింహులు, శ్రీనివాస్, రఫత్, ప్రశాంత్, కవిత పాల్గొన్నారు.

శంభుని ఆలయంలో ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

కొండపాక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెడ స్వయంభూ శంభుని ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, లక్ష్మీ గణపతి, సుదర్శన, రుద్ర హోమం కార్యక్రమాలు జరిగాయి. రాత్రి దీప్తికుంభాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాత సబితా రాఘవరెడ్డి, కమిటీ ప్రతినిధులు మంచాల శ్రీనివాస్,పెద్దంకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

సిద్దిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని మొదటి వార్డు మాజీ కౌన్సిలర్ నిమ్మ రజితాగిరి ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ సిబ్బందిని శాలువాతో సన్మానించారు. మున్సిపాలిటీ కార్మికుల సేవలను గుర్తించి సిబ్బందిని సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌కుమార్, సిబ్బంది ప్రవీన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కొలి సమాజ్ కార్యవర్గ సభ్యుడిగా యాదగిరి

ములుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అఖిల భారతీయ కొలి సామాజిక కార్యవర్గ సభ్యుడిగా కొట్టాల యాదగిరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ములుగు మండలం తునికిబొల్లారం ముదిరాజ్ కులస్థులు శాలువాతో సన్మానించారు.

ప్రతీ కార్యకర్తకు అండగా బీఆర్ఎస్

వర్గల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మీనాజీపేటకు చెందిన నీల యాదగిరి కొన్ని రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. శనివారం మృతుడి కుటుంబీలకు రూ. 2లక్షల ప్రమాద బీమా చెక్కును ఆయన అందజేశారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం




దూళిమిట్ట ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్‌లో విద్యార్థులు, నంగునూరు మండలం అక్కెనపల్లి మోడల్ స్కూల్‌లో ఓటు వేస్తున్న ఓ విద్యార్థి


హుస్నాబాద్‌లో ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా విద్యాసంస్థల్లో విద్యార్థులతో అవగాహన ర్యాలీలు చేపట్టి ఓటు ప్రాముఖ్యత గూర్చి తెలియజెప్పారు. ఓటును సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి సూపరింటెండెంట్ డాక్టర్ సురేషబాబు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిఖత్ అంజూమ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్‌ను సన్మానించారు. అనంతరం ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ నాయక్ విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. మర్కుక్ మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులచే మాక్ పోలింగ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. నంగునూరు మండలంలోని అక్కెనపల్లి మోడల్ స్కూల్‌లో సోషల్ డిపార్ట్మెంట్ అధ్యాపక బృందం ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు ప్రాముఖ్యత, పోలింగ్ ప్రక్రియ గూర్చి అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. దూళిమిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికలపై విద్యార్థులతో నమూనా పోలింగ్ నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి తెలిపారు. ములుగు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులచే మాక్‌పోలింగ్ నిర్వహించారు. దుబ్బాక, మిరుదొడ్డి మండల కేంద్రాలో విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఓటుహక్కు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్గల్ మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు విద్యార్థులతో కలసి ర్యాలీనిర్వహించారు. దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియల్ జడ్పీ పాఠశాలలో పదవ తరగతిని విద్యార్థిని విద్యార్థులకు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పోటీలకు ఎన్నికలు నిర్వహించారు. మద్దూరులో తహసీల్దారు రహీం, ఎంపీడీవో రాంమోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. రేబర్తిలో ఎంఈవో ఆధ్వర్యంలో సెక్రటరీ మాదవ్ జాదవ్ ఓటుహక్కుపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.